

భోగి భాగ్యాలు పంచాలని..



సంక్రాంతి పండుగ వచ్చేసింది.. భోగభాగ్యాలు పంచాలని భోగిమంటలు వేయడం ఆనవాయితీ.. ఆ మంటల్లో కష్టాలన్నీ కాలిపోయి సుఖసంతోషాలు రావాలని.. సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ తొలిరోజు భోగి మంటలు వేస్తారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా వీధివీధినా భోగిమంటలకు ఏర్పాట్లు చేశారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెంలో భోగిమంట ఏర్పాట్లు ఇలా..

ఆలయాలకు.. పెద్ద పండగే!

ఆలయాలకు పండగొచ్చింది.. సంక్రాంతి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేస్తున్నారు.. ప్రధాన ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగ మూడు రోజులు ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులుహాజరవుతారు. అందుకు తగిన విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ చిత్రంలో చూడండి.. అన్నవరం సత్యదేవుడి ఆలయాన్ని ఎలా ముస్తాబు చేశారో.. రంగవల్లులు వేశారు.. బొమ్మలకొలువు ఏర్పాటు చేశారు. పువ్వులతో ఆలయాన్ని అందంగా అలంకరించారు.



పేకాట శిబిరంపై పోలీసుల దాడి

- బెండపూడిలో పది మంది అరెస్ట్
- రూ.1,12,220 నగదు స్వాధీనం

తొండంగి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం బెండపూడి శివారు ఒక ప్రైవేటు పాఠశాల వెనుక ప్రాంతంలో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం దాడి జరిపి రూ.1,12,220 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. పేకాట ఆడుతున్న పదిమందిని అరెస్ట్ చేశామన్నారు. పిట్టా కుసలన్న, యజ్జపు నాగన్నదొర, ప్రగడ దుర్గయ్య, చిక్కాల రమణ, తోకాడ లోవరాజు, కొయ్యా కొండబాబు, చిన్నింశెట్టి జోగయ్య, నరం లోవరాజు, కోటిపల్లి సత్తిబాబు, తాటిపర్తి అప్పల స్వామిల పై కేసు నమోదు చేశామన్నారు. సంక్రాంతి సందర్భంగా పేకాట, గుండాట ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు పోలీస్ గ్రీవెన్స్ రద్దు

కాకినాడక్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పోలీస్ గ్రీవెన్స్) భోగి పండుగ కారణంగా సోమవారం రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ, ప్రయాసలతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు రావద్దని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జిల్లావ్యాప్తంగా.. పందెంబరుల తొలగింపు



పందెంబరులను తొలగిస్తున్న దృశ్యం

కాకినాడక్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా కోడి పందేలకు సిద్ధం చేస్తున్న బరులను ఎక్కడికక్కడ పోలీసులు ధ్వంసం చేస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో కాకినాడ సబ్‌డివిజన్ పరిధిలో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు ఆధ్వర్యంలో తిమ్మాపురం, సర్పవరం, కరప, పెదపూడి, గొల్లపాలెం, కోరింగ, ఇంద్రపాలెం, పిఠాపురంటౌన్, పిఠాపురం రూరల్, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బరులను ధ్వంసం చేశారు. పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో ఎస్‌డీపీవో శ్రీహరిరాజు ఆధ్వర్యంలో పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ప్రత్తిపాడు, అన్నవరం, రౌతులపూడి, ఏలేశ్వరం, తునిరూరల్, తొండంగి, కోటనందూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో బరులు ధ్వంసం చేసినట్లు ఎస్పీ తెలిపారు. కోడి కత్తుల తయారీ, విక్రేతలను, కోడికత్తులు కట్టే వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు.

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు 5

రె..ఢీ



అదిరిపోయేలా : కాకినాడ అచ్చంపేట జంక్షన్‌లోని ఏడీబీ రోడ్డు పక్కగా క్రికెట్ స్టేడియంలా ఏర్పాటు చేసినబరి..

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో కో..ఢీ

సినిమా సెట్టింగ్ కాదు సుమా : కోనసీమ జిల్లా మురమళ్లలో సకల హంగులతో ఏర్పాటు చేసిన బరి

పోలీస్ వర్సెస్ కోడి..ఈ పోటీలో గెలుపెవరిదో మరి కొన్ని క్షణాల్లో తేలిపోనుంది.. నిర్వాహకులు తగ్గేదేలే అంటే.. పోలీసులూ అదే దారిలో ఉన్నారు.. అక్కడక్కడా బేరాలు సాగిపోతున్నాయి. అటు పోలీసులు బరి తెగిస్తే.. ఇటు నిర్వాహకులు అదే దారిలో ఉన్నారు. కోడి పందాలు, గుండాట వంటి జూదాలకు ఎగబడుతున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే పండుగ మూడు రోజులు అనుమతిస్తారన్న ధైర్యంతో ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సంక్రాంతి అంటే గోదావరి జిల్లాలకు కోడిపందెం పెద్ద ఆకర్షణగా మారింది. 21 నియోజకవర్గాల్లోనూ బరులు సిద్ధం చేశారు. గతంలో వైసీపీ నేతలు బరితెగిస్తే.. ఈసారి అదే ఒరవడిని కూటమి నేతలు కొనసాగించడం గమనార్హం.

(రాజమహేంద్రవరం/అమలాపురం/ దేవరపల్లి/ గోపాలపురం/ పెరవలి/ కొవ్వూరు/ ఐ.పోలవరం- ఆంధ్రజ్యోతి)



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో థియేటర్‌ను తలపించేలా..

సంక్రాంతి కోడి పందాలకు రంగం సిద్ధమైంది. కోడి పందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని పోలీస్,రెవెన్యూ యంత్రాంగం హెచ్చరిస్తున్నా నిర్వాహకులు మాత్రం తగ్గేదేలే అంటూ ఎప్పటి మాదిరిగానే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పందాలకు సర్వం సిద్ధం చేశారు. చాలాచోట్ల కోడి పందాల శిబిరాలు క్రికెట్ స్టేడియాలను తలపిస్తున్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద బరులకు రూ.50 లక్షల వరకూ వేలంపాట వేస్తున్నారు. చిన్న గ్రామాల్లో కూడా రూ.16 లక్షల వరకూ ఉన్నాయి. జూదం విపరీతంగా పెరిగింది. ఒక్కో బరిలోనూ గుండాట నిర్వహణకు రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఇస్తున్నట్టు సమాచారం.గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీ ద్వితీయ స్థాయినేతలు,గ్రామనేతలు వీటిని ఎక్కువ నిర్వహిస్తున్నారు. జూద క్రీడల నిర్వహణకు ఆయా ప్రాంతాల్లో ఉన్న కూటమి నేతలు ముందుకు రావడం, ఎమ్మెల్యేల ద్వారా సిఫార్సులు చేయించుకుని అనుమతులు పొందడం ద్వారా లక్షల లాభార్జన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ మూడు రోజుల పందాలు వారికి మంచి ఆదాయ వనరుగా మారాయి.గతంలో ఎన్నడూ లేనివిధంగా జూదం పెరిగిపోయింది. గతంలో అమ్మవారి తీర్థాల వంటి వాటికి చాటుమాటుగా గుండాట ఆడేవారు. ఇవాళ సంక్రాంతి అంటే అన్ని ఊర్లకు గుండాటలు వచ్చేశాయి. ఇవి మన సంప్రదాయమా? ఇది పచ్చి జూదం. అక్కడకు వచ్చిన ప్రజల జేబులను నిలువునా దోపిడీ చేస్తారు.



క్రికెట్ స్టేడియాలా..బరులా!

మురమళ్ల వద్ద పందెం బరిని మినీ స్టేడియాన్ని తలపించే రీతిలో తీర్చిదిద్దారు.ప్రత్యేక అతిథులు కొందరు సినీ నటులు బరికి హాజరయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా పక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్ర పరిధిలోని యానాంలో హోటళ్ల రూమ్‌లతో పాటు గెస్ట్‌హౌస్‌లను సిద్ధం చేసినట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో నాలుగైదు చోట్ల కోడి పందాలు వేసేందుకు బరులు సిద్ధం చేశారు.ఐ.పోలవరంలో సుమారు 200 మంది వీఐపీలు కూర్చుని పందాలను తిలకించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. ప్రధాన పందెం బరి చుట్టూ ఇనుప కంచెతో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. వీఐపీలకు పసందైన విందు భోజనాలు ఏర్పాట్లు చేస్తున్నారు. ముమ్మిడివరంలో మాత్రం పోలీసులు ఓ బరి వద్దకు వెళ్లి ఏర్పాట్లను దగ్గరుండి తొలగించారు. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట శివారులో ఒక బరి, గోపాలపురంలో ఒక బరిని పోలీసులు ధ్వంసం చేశారు.

ఇక్కడే మద్యం..పేకాట ఉంటాయి.నీతులు వల్లించే పోలీసులు మామూళ్లకు కక్కుర్తిపడి చట్టాన్ని ప్రక్కన పడేస్తున్నారు.ఉభయ రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు స్వస్థలాలకు భారీగా చేరుకుంటున్నారు.సోమవారం నుంచి ప్రారంభమయ్యే సంక్రాంతి ఉత్సవాలను తిలకించేందుకు ఉవ్విళ్లూరుతున్న వారికి జూదక్రీడలు ప్రత్యేక ఆకర్షణగా మారనున్నాయి.

- నేటి నుంచి ఆటకు అంతా రెడీ
- బరి తెగించిన నిర్వాహకులు
- కూటమి నాయకుల గ్రీన్‌సిగ్నల్
- పోలీసులు వద్దంటున్నా ఏర్పాట్లు
- కొన్ని చోట్ల బేరసారాలు
- బరులకు వేలం నిర్వహణ
- ఒక బరి రేటు రూ.అర కోటి
- క్రికెట్ స్టేడియాల్లా తయారు
- అతిథులకు విందు భోజనాలు

పోలీసులూ బరి తెగించారు!

పట్టణాలు, పల్లెలు సహా అనేక ప్రాంతాల్లో పందెం బరులను బహిరంగంగా వేస్తున్నారు. వీటి నిరోధానికి పోలీసు,రెవెన్యూ అధికారులు హెచ్చరికలు తప్ప బరిలో మాత్రం దిగడంలేదు. పోలీసు యంత్రాంగానికి ఆయా ప్రాంతాల్లో జరిగే పందాల నిర్వాహకులు భారీగానే మామూళ్లు ముట్టచెబుతున్నారు. గతం కంటే భిన్నంగా ఈసారి మామూళ్ల రేట్లను పెంచేశారంటూ కొన్నిచోట్ల గగ్గోలు పెడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతల సంయుక్త సహకారంతో పందెం బరులు సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 నియోజకవర్గాల పరిధిలో పందెం బరులు సిద్ధమయ్యాయి. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్ల చెంతనే వీటిని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు చెప్పిన బరులకే పోలీసులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు.ముందుగానే అన్ని మాటలు మాట్లాడుకున్న తర్వాతే వీటికి అనుమతులిస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. పోలీసు యంత్రాంగం ఈసారి అసలు పట్టించుకోకపోవడం వెనుక రాజకీయపరమైన ఒత్తిళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. అధికారులు కనీసం ఉనికి చాటకపోవడం వెనుక భారీగా ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని ప్రచారం జరుగుతోంది.

లక్షల్లో గుండాట వేలం..

కోనసీమ జిల్లాలోని మురమళ్ల, చెయ్యేరు, ఎస్.యానాంతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగే పందెం బరుల వద్ద గుండాట బోర్డులు ఏర్పాటు చేసేందుకు బహిరంగ వేలం ద్వారా పాటలు జరిగినట్టు తెలిసింది. మురమళ్ల బరి వద్ద గుండాట కోసం ప్రత్యేక సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. చెయ్యేరులో గుండాట కోసం నిర్వాహకులు బరిని రూ.18 లక్షలకు దక్కించుకున్నట్టు తెలిసింది. తూర్పుగోదావరి జిల్లాలో అయితే రూ. 7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ వేలం జరిగినట్టు సమాచారం.

బరిలో బాక్సింగ్‌కు రెడీ..

డబ్ల్యుడబ్ల్యుఎఫ్ చూస్తుంటే... బాక్సింగ్ రింగ్‌లో దిగేటప్పుడు బాక్సర్లు ఒత్తిడిని అధిగమించడానికి ఎక్సర్‌సైజులు చేస్తుంటారు.. ఇక్కడ కోడిని చూడండి.. ఏం చేస్తోందో గమనించండి. సంక్రాంతి పండుగ వచ్చేయడంతో నేడో, రేపో ప్రతి కోడీ బరిలో దిగాల్సిందే.. ఈ మేరకు నిర్వాహకులు కోళ్లతో ఇలా ఎక్సర్‌సైజులు చేయిస్తున్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వీకే రాయపురంలో ఇలా....



జిల్లాస్థాయి కబడ్డీ పోటీల విజేత 'రామన్నపాలెం'



రామన్నపాలెం, ఐడియల్ కళాశాల జట్ల మధ్య ఫైనల్స్



విజేతగా నిలిచిన రామన్నపాలెం జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

కాకినాడ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం చీడిగలో కూటమి నాయకులు, మాజీ సర్పంచ్ పితాని అప్పన్న ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రెండురోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 11 జట్లు పాల్గొనగా ఫైనల్స్ పోటీల్లో రామన్నపాలెం జట్టు విజేతగా నిలిచింది. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ సమన్వయకర్త సత్తిబాబు, కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ఫైనల్స్‌కు చేరిన జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని ఐడియల్ కళాశాల రామన్నపాలెం జట్ల మధ్య రసవత్తరంగా జరిగిన ఫైనల్స్ కబడ్డీ పోటీలను వీక్షించారు. ద్వితీయ స్థానంలో ఐడియల్ కళాశాల జట్టు, తృతీయ స్థానంలో గొల్లపాలెం, కొవ్వాడ జట్లు నిలిచాయి. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేత జట్లకు రూ.15000, రూ.10,000, రూ.5000 నగదు బహుమతులను అతిథులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.



60 కిలోల విభాగంలో విజేతలు (పైన)



60 కిలోల విభాగంలో ప్రథమ స్థానం సాధించిన దుర్గాప్రసాద్‌కు షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

బాడీ బిల్డింగ్‌లో యువత సత్తా

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ఆదివారం రాత్రి ఫస్ట్ యునైటెడ్ డిస్ట్రిక్ జోనల్ బాడీ బిల్డింగ్-ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025 ప్రారంభమైంది. కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్, హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవంలో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు. తొలుత అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రారంభోత్సవ సభలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్రోకెమ్ అధినేత నండెపు వెంకటేశ్వరరావు (బాలాజీ), బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, ప్రధాన కార్యదర్శి మోకా వెంకటసుబ్బారావు, పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు. వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలనతో ఉమ్మడి జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలను ప్రారంభించారు. అర్థరాత్రి వరకు పలు విభాగాల్లో కొనసాగాయి. 55 కిలోల విభాగంలో ఎస్.రమేష్ (చింతూరు), బి.మనోజ్ కుమార్ (కాకినాడ), పి.రాజు (రాజమహేంద్రవరం) వరుస స్థానాల్లో నిలిచారు. 60 కిలోల విభాగంలో ఎం.దుర్గాప్రసాద్ (కాకినాడ) ప్రథమ, ఎస్.వెంకటరమణ (కాకినాడ) ద్వితీయ, వి.జార్జ్‌విట్‌ఫీల్డ్ (ప్రత్తిపాడు) తృతీయ, 65 కిలోల విభాగంలో ఎస్.దిలీప్ (రాజమహేంద్రవరం), కె.హర్ష (కాకినాడ), సీహెచ్ రవికుమార్ (రాజమహేంద్రవరం), 70 కిలోల విభాగంలో పి.బాలరాజు (కాకినాడ), ఎల్.దుర్గాప్రసాద్ (తుని), ఎస్‌కేజీ ఖాశిం (అమలాపురం) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 75 కిలోల విభాగంలో పి.శివగణేష్ (అమలాపురం), జీపీఎస్ఎస్ఎస్ బాలాజీ (రాజమహేంద్రవరం), కేఎంటీ కుమార్ (మలికిపురం) వరుస స్థానాలు సాధించారు.

విజేతలకు జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పతకాలు, షీల్డులు, సర్టిఫికెట్లను కల్వకొలను తాతాజీ, లింగోలు పండు, రవణం వేణుగోపాల్ అందజేశారు. తొలుత సీనియర్ బాడీబిల్డర్లు చిత్రపు కుమార్, నగభేరి కృష్ణమూర్తి, గారపాటి చంద్రశేఖర్, దొమ్మేటి వెంకటరమణ, మట్టపర్తి సముద్రంలను సత్కరించారు. ఆశెట్టి ఆదిబాబు ఈవెంట్ ఆర్గనైజర్‌గా వ్యవహరించారు.



కందిపప్పుకే ఎసరు

- పండుగ పూట నిరుత్సాహపడిన రేషన్‌కార్డుదారులు
- జిల్లాకు 60శాతం మాత్రమే కేటాయింపు
- 30నుంచి 35 లోపే లబ్ధిదారులకు అందిన కందిపప్పు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి పండగ పూట కందిపప్పు అందక జిల్లాలో రేషన్‌కార్డుదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నవంబరు నెల నుంచి ప్రతి కార్డు హోల్డర్‌కు రూ.67కే కిలో కందిపప్పు ఇస్తున్న సంగతి తెలిసిందే. బయట మార్కెట్‌లో రూ.90 నుంచి రూ.180 వరకూ రకరకాల ధరలతో విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.67కే నాణ్యమైన కందిపప్పు అందివ్వడంతో ప్రజలంతా చాలా సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం 2023 నుంచి కందిపప్పు ఇవ్వడం మానేసింది. కూటమి ప్రభుత్వం గతేడాది నవంబరు నుంచి ప్రతి కార్డుకు కిలో కందిపప్పును రూ.67కే అందిస్తూ వచ్చింది. కానీ జనవరిలో జిల్లాకి 60శాతం కందిపప్పు మాత్రమే కేటాయించారు. అందులో జిల్లాలోని 5 ఎంఎల్‌పాయింట్లకు సరుకు వచ్చిన తర్వాత నాణ్యత బాగా లేకపోవడంతో అనేక టన్నుల కందిపప్పును తిరిగి పంపించేశారు. రాజమహేంద్రవరంలోని ఒక ఎంఎల్ పాయింట్ నుంచి 70 టన్నుల పప్పు తిరిగి పంపించాల్సి వచ్చింది. అన్ని జిల్లాల్లో అన్ని ఎంఎల్ పాయింట్ల నుంచి పప్పు తిరిగి వెళ్లింది. అసలు జిల్లాకు 60శాతం కేటాయించగా అందులో నాణ్యతలేని పప్పును తిరిగి పంపడంవల్ల జిల్లాలోని ప్రజలకు 30నుంచి 35శాతం మంది కార్డుదారులకు మాత్రమే పప్పు అందడం గమనార్హం. జిల్లాలోని 5లక్షల75వేల మంది రేషన్‌కార్డుదారులకు ఒక్కో కార్డుకు ఒక కిలో వంతున పంపిణీ చేయాల్సిఉంది. కానీ కేవలం 30నుంచి 40శాతం మందికే పప్పు అందడంతో అందరూ పండగరోజున అసంతృప్తితో ఉన్నారు. మొదట్లో రేషన్ అందిన వారికి బాగానే పప్పు కూడా అందింది. చివరలో సరఫరా చేసిన వారికి పప్పు అందలేదు.

ఇంటింటికీ రేషన్‌తో కొందరికి ఇబ్బంది

గత వైసీపీ అమలు చేసిన ఇంటింటికీ రేషన్ విధానంతో ప్రతినెల కొందరికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎండీయు వాహనాలు తక్కువగా ఉండడంతో రెండు, మూడు గ్రామాలకు ఒక వాహనం నడుపుతున్నారు. దీంతో ఎంఎల్ పాయింట్ల నుంచి కనీసం రెండు విడతలుగా సరుకు వస్తుంది. ప్రతినెలా 20నుంచి 25 వరకూ ఒక విడతగా 25నుంచి 30వతేదీ లోపు రెండో విడతగా రేషన్‌ను డీలర్లకు, ఎండీయూ వాహనాలకు అందిస్తారు. వాటితో జనవరి 1నుంచి 10లోపు, కొంతమంది 15వతేదీ లోపు ఇస్తున్నారు. ప్రతినెలా ఎండీయు వాహనాలు కొన్ని ప్రాంతాలకు చివరి రోజుల్లో వస్తాయి. ఏదైనా సరుకు కొరత వస్తే చివరి రోజుల్లో రేషన్ అందుకునే వారికే తక్కువ అవుతోంది.

కేరళ తరహాలో....

ఆత్రేయపురంలో సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీలో భాగంగా డ్రాగన్ పడవ పోటీలు

తిలకించిన ఎమ్మెల్యేలు, రుడా చైర్మన్





ఆత్రేయపురంలో నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు, విజేతలకు మెడల్స్ అందజేసిన ప్రజాప్రతినిధులు

ఆత్రేయపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కెనాల్‌లో సర్‌ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కేరళ తరహాలో డ్రాగన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్రోఫీ పోటీలు స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ఆత్రేయపురం ప్రధాన కాలువలో రెండో రోజు ఆదివారం నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కేరళను తలపించేలా డ్రాగన్ పడవ పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్రంలోని 9 జిల్లాల నుంచి 11 టీమ్‌లు 121 మంది పడవ పోటీలలో పాల్గొన్నారు. ఆత్రేయపురం నుంచి ఉచ్చిలి వరకు ప్రధాన కాలువకు ఇరువైపులా జనసందోహం పోటీలను తిలకించారు. కేరళ వాయిద్యాలు, ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా పోటీలను ఉత్సాహభరితంగా వీక్షించారు. ఎమ్మెల్యే బండారుతో పాటు రాజోలు ఎమ్మెల్యే వరప్రసాదరావు, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిలు పడవ పోటీలను జెండా ఊపి ప్రారంభించారు. డ్రాగన్ పడవ పోటీలతో పాటు కాయాకింగ్, కెనాయింగ్, పారాకయ్యా పడవ పోటీలు రసవత్తంగా సాగాయి. దివ్యాంగులు సైతం ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. పోటీల్లో జంగారెడ్డిగూడెం జెయింట్, పల్నాడు తండర్స్, ఎన్టీఆర్ ఈగల్స్, కోటిపల్లి సీతాష్, పల్నాడు పాంథర్స్, కృష్ణ లయన్స్ సెమి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. సోమవారం ఫైనల్స్ పోటీల్లో భాగంగా విజేతలను ప్రైజ్‌మనీ, జ్ఞాపికలతో సత్కరించనున్నారు. ఈ ట్రోఫీలో భాగంగా ఎమ్మెల్యే బండారుపై అభిమానంతో రాచకొండ శ్రీనివాస్ క్రియేట్ చేసిన పాట సీడీని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కరుటూరి నరసింహరావు, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ముత్యాల బాబ్జి, కంఠంశెట్టి శ్రీనివాస్, విక్టరీ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి, సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి, తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, వివిధ శాఖాధికారులు ఉన్నారు.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవానికి మరోసారి కేంద్రం గుర్తింపు

కేంద్ర పర్యాటక వెబ్‌సైటులో ఏకాదశ రుద్రుల ఉత్సవం



వెబ్‌సైటులో రూపొందించిన ప్రభల ఉత్సవం

అంబాజీపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచం నలుమూలలకు విస్తరించిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవాన్ని మరోసారి కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవ్ విభాగంలోని వెబ్‌సైటులో చోటు కల్పించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామానికి చెందిన శివకేశవయూత్ సభ్యులు 450 ఏళ్లచరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యాన్ని చరిత్రను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లేఖరాశారు. దీంతో కేంద్ర పర్యాటక శాఖమంత్రిత్వ శాఖ ఉత్సవ నిర్వహణ, 11 ఏకాదశ రుద్రుల ప్రభల రూపాలు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల రుద్రుల ప్రభలు పచ్చనిచేలను తొక్కుకుంటూ అప్పర్ కౌశిక దాటే దృశ్యాలు, ఉత్సవాన్ని తిలకించేందుకు జగ్గన్నతోటకు వచ్చేలక్షలాది జనం తదితర అంశాలను పరిశీలించారు. ఈ మేరకు శనివారం అర్ధరాత్రి కేంద్ర పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో చోటు కల్పించారు. కేంద్ర పండుగల జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చింది. ఇప్పటికే శివకేశవ యూత్ సభ్యులు ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాయడంతో ఆయన స్పందించి 2020లో ఏకాదశ రుద్రుల ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రతిలేఖను రాశారు. అలాగే 2023 జనవరి 26వ ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ తరుపున జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల థీమ్‌ను ప్రత్యేకంగా శకటంగా రూపొందించి ప్రదర్శించారు. దీంతో దేశ విదేశాల్లో జగ్గన్నతోట మరింత విస్తరించింది. తాజాగా కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వెబ్‌సైటులో చోటు కల్పించడంతో 11 గ్రామాల ప్రజలు, గంగలకుర్రు అగ్రహారం శివకేశవయూత్ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో జగ్గన్నతోట ప్రభల ఉత్సవాన్ని కేంద్ర, రాష్ట్రపండుగగా నిర్వహించాలని కోరుతున్నారు.

రిప్లబిక్ డే వేడుకల్లో..

ప్రదర్శన ఇవ్వనున్న ముక్కామల అయ్యప్పస్వామి గరగబృందం




ఢిల్లీలో ముక్కామల కళాకారులు

అంబాజీపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 26న ఢిల్లీలో జరిగే వేడుకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ముక్కామల పుసుపులేటి అయ్యప్పస్వామి గరగ కళాకారుల బృందం ప్రదర్శించనున్నారు. గరగ నృత్య ట్రూప్ లీడర్ అయ్యప్పస్వామి ఆధ్వర్యంలో 100 మంది కళాకారులు ఢిల్లీలోని శకటం వద్ద ప్రదర్శించున్నారు. అలాగే ఈనెల 13న ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట గరగనృత్య బృందం ప్రదర్శన ఇవ్వనున్నట్టు ఆయన తెలిపారు. నృత్య ప్రదర్శనను కేంద్ర సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమి ద్వారా ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రదర్శన చేయనున్నట్టు తెలిపారు. గత నెల రోజుల నుంచి ఢిల్లీలో 100 మంది కళాకారులు సాధన చేస్తున్నట్టు అయ్యప్ప విలేకర్లకు తెలిపారు.

రేపటి నుంచి జాతీయ, రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజుపంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 14 నుంచి 17 వరకు జాతీయ, రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఇఫ్ ఇండియా సంయుక్తకార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి గన్నమనిచక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.చెలికానిస్టాలిన్ ఆదివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. 14వ ఆల్‌ఇండియా 20వ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ టోర్నమెంట్ మెన్ అండ్ ఉమెన్ పోటీలు నిర్వహిస్తామని ప్రకటించారు. బాస్కెట్ బాల్ టోర్నమెంటు మంత్రి వాసంశెట్టి సభాష్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీలు పిల్లి సుభాష్ చంద్రబోస్, గంటి హరీష్‌మాధుర్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యానారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి హాజరవుతారని తెలిపారు. 17న విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందని వారు పేర్కొన్నారు.

రత్నగిరిపై డీఐజీ పూజలు



డీఐజీకి వేదపండితుల ఆశీర్వచనం

అన్నవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం అగ్నిమాపకశాఖ డీఐజీ నిరంజనరెడ్డి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు.

నేడు సంక్రాంతి సంబరాలు

అన్నవరం దేవస్థానంలో సోమవారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నారు. ఉదయం 5గంటలకు భోగి మంటలతో ప్రారంభిస్తారు. తెలుగుదనం ఉట్టిపడేవిధంగా వివిధ జానపద నృత్యాలు, వేషధారణలు, కోడిపుంజులు, ఎడ్లబండి, బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు.

పండుగ ఆనందం ఆవిరి!

» కొత్త దుస్తులు కొనేందుకు వెళ్తుండగా కబళించిన మృత్యువు

» రోడ్డు ప్రమాదంలో భార్య మృతి, భర్తకు తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం



మరణించిన మేఘన



(ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు పిల్లలకు కొత్త దుస్తులు కొనాలని ఆనందంగా రాజమహేంద్రవరం మార్కెట్‌కు వెళ్తుండగా ప్రమాదం కబళించింది. ఈ ఘటనలో భార్య మృతిచెందగా భర్త తీవ్ర గాయాలపాలై చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళితే.. రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన గాడి గోపినాథ్, గాడి మేఘన (35) భార్యాభర్తలు. వారికి ఓ పాప, బాబు. గోపినాథ్ స్థానికంగా ఓ ప్రైవేట్ స్కూల్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు పిల్లలకు దుస్తులు కొనుగోలుచేసేందుకు ఇద్దరూ ఆదివారం సాయంత్రం రాజమహేంద్రవరం బైక్‌పై వెళ్తుండగా స్థానిక ఆటోనగర్ వద్దకు వచ్చేసరికి ఐషర్ వ్యాన్, కారు మధ్యకు వీరి బైక్ రావడంతో వ్యాన్ సైడ్ భాగం బ్యాక్ హ్యాండిల్ తగలడంతో ఇద్దరూ కింద పడిపోయారు. మేఘన వెనకకు పడడంతో తలకు బలమైన అక్కడికక్కడే మృతి చెంది ంది. గోపినాథ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అం బులెన్స్‌లో అతడిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి బొమ్మూరు పోలీసులు చేరుకుని మేఘన మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు. వ్యాన్‌ను, కారును అదుపులోకి తీసుకున్నారు.

సంక్రాంతికి స్వగ్రామం వస్తుండగా..

నిద్ర మత్తులో బైక్ నుంచి జారి పడి యువకుడి మృతి



మరణించిన సత్యనారాయణ



(ఫైల్ ఫొటో)

దేవరపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు హైదరాబాద్ నుంచి వస్తుండగా మోటార్‌సైకిల్ నుంచి జారిపడి యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామం వెళ్తుండగా మార్గం మధ్యలో దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం వద్ద ఆదివారం ఉదయం 5.50గంటలకు మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న కందిపల్లి సత్యనారాయణ (25) నిద్రమత్తులో జారిపడడంతో తలకు తీవ్రగాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. సత్యనారాయణ ఉపాధి కోసం ఐదేళ్ల క్రితం హైదరాబాద్ వెళ్లి తాపీ పనిచేస్తుండగా అతడి చిన్నాన్న కందిపల్లి తలుపులయ్య వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి బావ సీహెచ్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. కాగా ఇద్దరూ హైదరాబాదులో శనివారం రాత్రి 9గంటలకు బయలుదేరినట్టు పేర్కొన్నారు.

ఊలపల్లిలో విషాధఛాయలు

బిక్కవోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం సూర్యనారాయణపురం జాతీయ రహదారిపై బైక్ జారి పడి కడిపల్లి సత్యనాయణ(25) మృతి చెందడంతో అతడి స్వగ్రామమైన బిక్కవోలు మండలం ఊలపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వీరబాబు, అన్నవరం దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు. కుమార్తెకు పెళ్లవ్వడంతో కుమారుడు సత్యనారాయణే తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. తాపీ పని చేసే సత్యనారాయణ హైదరాబాద్ వెళ్లి పనిచేస్తున్నాడు. తల్లిదండ్రులను తన వద్దే ఉంచుకుంటున్నాడు. ఇటీవల ఊలపల్లిలో ఇల్లు కూడా నిర్మించాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా తల్లిదండ్రులను, ఈ ప్రాంతం నుంచి తాపీ పనికి వచ్చిన వారందరితో వ్యాన్‌లో పంపి సత్యనారాయణ తన బాబాయ్‌తో కలసి బైక్‌పై ఊలపల్లికి వస్తుండగా సూర్యనారాయణపురం వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో పండుగ పూట ఊలపల్లిలో విషాధఛాయలు అలుముకున్నాయి.

శానిటేషన్ స్టాక్‌యార్డులో అగ్నిప్రమాదం

రూ.15లక్షల ఆస్తి నష్టం



గొల్లప్రోలులో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గొల్లప్రోలు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు నగర పంచాయతీ శానిటేషన్ స్టాకుయార్డులో ఆదివారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగి రూ.15లక్షల ఆస్తి నష్టం సంభవించింది. నగర పంచాయతీ శానిటేషన్ విభాగానికి చెందిన పరికరాలు, మిషన్లు, సామగ్రి భద్రపరిచినగదిలో ఆకస్మాతుగా మంటలు చెలరేగి అక్కడే చెప్పులు నిల్వ చేసిన గొడౌన్‌కు వ్యాపించాయి. ప్రమాదంలో స్టాకు యార్డులోని ఫాగింగ్ మిషన్లు, స్ప్రేయింగ్ మిషన్లు, చెట్లు, గడ్డి, కరోనా మిషన్లు, చీపురుకట్టలు, డస్ట్‌బిన్లు తదితర సామగ్రి కాలిపోయాయి. కాలిన శానిటేషన్ పరికరాలు విలువ రూ.7లక్షలు వరకూ ఉంటుందని చెబుతున్నారు. అదేవిధంగా గోడౌన్‌లో పండుగ విక్రయాలు నిమిత్తం భారీగా నిల్వ చేసిన చెప్పులు కాలిపోవడం వల్ల రూ.8లక్షలకు పైగా నష్టం జరిగిందని షాపు యజమాని గండే నాగేశ్వరరావు తెలిపారు. భారీగా మంటలు చెలరేగడంతో అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. గొల్లప్రోలు తహశీల్దారు సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
WANTED
★ వరంగల్‌లో హాస్టల్‌లో వంట చేయుటకు భార్యాభర్తలు కావలెను. వసతి కల్పించబడును. సం॥ ప్ర॥ 8074465703, 9849038142
AJW-14294

4 Lines CLASSIFIED Rs.230/- Only

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీల్లో పాల్గొన్న ఆర్చర్లు

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బాలురు, బాలికల ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలు నుంచి ఆర్చర్లు పోటీ పడ్డారు. ఇండియన్ రౌండ్ విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరచిన 12మందిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. బాలుర విభాగంలో జె.రాఘవేంద్ర అరుణ్, పి.నాని, బి.జయదీప్, జేఆర్.ఆదిత్య, ఎస్.లీలాప్రణవ్‌రెడ్డి, వి.రిత్విక్‌లు.. బాలికల విభాగంలో జె.ఐశ్వర్య సూర్యదీపిక, ఎస్‌కే హమీదా, పి.లక్ష్మీ, పీఏపీ చంద్రిక, కేఆర్‌పీసీ సుహాసిని, బి.తేజస్వినిదేవి విజయవాడలో ఈనెల 23నుంచి 25 వరకూ జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. పోటీలను రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే జగదీష్, విరవాడ సర్పంచ్ బోయి నాగేశ్వరరావు, ఆర్చరీ అసోసియేషన్ సభ్యులు సోము గోవింద రాజు, కె.చిన్నబ్బాయి, జే.ప్రసాదరావు ప్రారంభించారు. విజేతలకు ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రిన్సిపాల్ కేశవరావు, కౌన్సిలర్లు రాయుడు శ్రీనుబాబు, అల్లవరపు నగేష్, అభ్యుదయ ఫౌండేషన్ ప్రతినిధి బాదం సూర్యప్రకాష్, దానం లాజర్ బాబు, వెన్నపు చక్రధరరావు, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, కేతవరపు కృష్ణలు బహుమతులు అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా జి.శివప్రసాద్, పి.సాయి, బి.నవీన్‌వంశీలు వ్యవహరించారు.

మన్యంలో చింతూరు కేంద్రంగా రెండో అసెంబ్లీ సెగ్మెంట్?

(రంపచోడవరం, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు రాష్ట్రంలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరగాల్సి రావడం, త్వరలో జరిగే నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియపై ఇటీవల తీవ్రస్థాయిలో చర్చ సాగుతుండడంతో రంపచోడవరం మన్యంలోని గిరిజన ఆశావాహుల్లో ఇక్కడ ఏర్పాటు కాబోయే రెండో ఎస్టీ నియోజకవర్గం పైనా చర్చ సాగుతోంది. 2014లో జరిగిన రాష్ట్ర పునర్విభజన అనంతరం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం 11 మండలాలతో అతి పెద్ద గిరిజన నియోజకవర్గంగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ నియోజకవర్గం పరిధి ఇటు ఎమ్మెల్యేలకు, అటు ప్రజానీకానికి ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ భౌగోళిక పరిస్థితులు తద్వారా ఎదురైన పరిస్థితుల నేపథ్యంలో రంపచోడవరం నియోజకవర్గం కచ్చితంగా రెండుగా విభజించబడాల్సిన ఆవశ్యకతను అన్ని రాజకీయ పార్టీలు గుర్తించి, విలీన మండలాలతో కలిపి ఓ నియోజవర్గం ఏర్పాటుపై చర్చిస్తున్నారు. రంపచోడవరం నుంచి మరో నియోజకవర్గాన్ని విభజిస్తే 4 విలీన మండలాల్లో చింతూరు కేంద్రంగా ఇది ఏర్పాటవుతుందని భావిస్తున్నారు. అయితే ఈ 4 మండలాలకు అదనంగా ఇప్పటికే పోలవరం నియోజవర్గంలో విలీనమైన పూర్వపు భద్రాచలం నియోజకవర్గంలోని వేలేర్‌పాడ్, కుక్కునూరు మండలాలను కలిపి కొత్త నియోజకవర్గంగా చేస్తారా, లేక ఇపుడు రంపచోడవరం లోనే ఎగువ ప్రాంతంలో ఉన్న వై.రామవరం ఎగువ ప్రాంతాల పంచాయితీలతో పాటు మారేడుమిల్లి మండలాన్ని కూడా అందులో కలుపుతారా అన్న చర్చలు సాగుతున్నాయి. ఏదిఏమైనా నియోజవర్గాల పునర్విభజన రంపచోడవరం మన్యానికి బాగా దోహదపడుతుందని, మరికొంతమంది గిరిజన నేతలకు అవకాశం వస్తుందని పలువురు ఎదురుచూస్తున్నారు.

చోరీకి వచ్చి.. పోలీసులకు చిక్కి

ఏటీఎంలో దొంగతనానికి యత్నించిన ముగ్గురి పట్టివేత

గోకవరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి పాల్పడుతూ ముగ్గరు దొంగలు పోలీసులకు పట్టుబడగా మరో దొంగ పరారీలో ఉన్నాడు. డీఎస్పీ దేవకుమార్, సీఐ సత్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన ఏపూరి బెనర్జీ, నరసరావుపేటకు చెందిన రాచపూడి రాకేష్, మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన కొత్త గణేష్ ఈ నెల 10న కారుపై గోకవరం వచ్చి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులను చూసి కారులో పారిపోయే ప్రయత్నంచేయబోయారు. ఇంతలో ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి గుమ్మళ్ళదొడ్డి సమీపంలో కారును చుట్టుముట్టి పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన శ్యామ్‌సన్ పరారీలో ఉన్నాడు. అతడిపై గతంలో అనేక కేసులున్నాయి. బ్యాంక్ మేనేజర్ కందుకుర్తి సతీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆదమరిచి నిద్రిస్తుండగా..
అర్ధరాత్రి దొంగలు పడ్డారు

30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు చోరీ



క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరిస్తున్న సీఐ

అమలాపురం టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి వరకు టీవీ చూసి ఇంట్లో ఆదమరిచి నిద్రిస్తుండగా దొంగలు పడి రూ.10.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరించుకుపోయారు. సమాచారం తెలుసుకున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పట్టణ సీఐ వీరబాబు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం శివారు కురసాలవారి వీధిలో కోలా శేషు నివాసం ఉంటున్నాడు. సంక్రాంతి పండుగ కావడంతో భార్య, పిల్లలు పుట్టింటికి వెళ్లారు. శనివారం రాత్రి శేషు ఒక గదిలో, తల్లి మరో గదిలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి వరకు టీవీ చూసిన శేషు ఆదమరిచి నిద్రపోయాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో మెలకువ రావడంతో లేచి బాత్‌రూమ్‌కు వెళుతుండగా కిటికీ తలుపులు తెరిచి ఉండడాన్ని ఇంట్లో సామగ్రి చెల్లాచెదురుగా పడి ఉండడాన్ని గుర్తించాడు. ఇంట్లో దొంగతనం జరిగిందని గ్రహించి వెంటనే పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. బీరువాకు తాళాలు వేసి ఉండకపోవడంతో పాటు లాకరు తాళాలు కూడా అక్కడే ఉండడంతో కిటికీ తలుపులు తెరుచుకుని లోనికి వచ్చిన దొంగలు బీరువాలోని 30 కాసుల బంగారు ఆభరణాలు, రూ.1.50లక్షల నగదుతో కలిపి రూ.10.50లక్షల మేర అపహరించుకుపోయారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ ప్రసాద్, సీఐ వీరబాబు సిబ్బందితో వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. నేర ప్రదేశాన్ని పరిశీలించారు. డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. క్లూస్‌టీమ్, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పలు ఆధారాలు సేకరించారు. అనుమానితుల నుంచి వేలిముద్రలను తీసుకున్నారు. శేషు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

పాపికొండల విహారానికి 15 బోట్లు

దేవీపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి ప్రకృతి ప్రేమికులు పాపికొండల అందాలు తిలకించేందుకు 15 బోట్లలో 1042 మంది ఆదివారం పేరంటాలపల్లి వెళ్లారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, అగ్రహారం, మూలపాడు, మడిపల్లి, మంటూరు, తాళ్లూరు, గొందూరు, కచ్చులూరు, కొండమొదలు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లి సుమారు 2గంటల పాటు సందడి చేశారు. ముందుగా మాతృశ్రీ గండిపోశమ్మను దర్శించుకునివెళ్లారు.

మూడు రోజులు హౌస్‌ఫుల్

సంక్రాంతి పండుగ 3రోజులు పాపికొండలు విహారయాత్రకు వెళ్లే పర్యాటకుల టిక్కెట్లు హౌస్‌ఫుల్ అయినట్లు బోటు నిర్వాహకులు తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో టిక్కెట్లు

వెయ్యికి పైగా పర్యాటకులు

ఇప్పటికే అమ్ముడయ్యాయని వివరించారు.

పర్యాటక బోట్ల కాల వ్యవధి పెంచండి

పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల కాల వ్యవధి పెంచాలని పర్యాటకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పాపికొండలు వెళ్లేందుకు ఆన్‌లైన్‌లో హైదరాబాద్, బెంగుళూరు నుంచి పర్యాటకులు ముందుగాను టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. అయితే సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు బోటు పాయింట్‌కు చేరుకోవడానికి సమయం 40 నిమిషాలు ఆలస్యమవడంతో ప్రభుత్వ బోటు అధికారులు నిలిపివేశారు. దూర ప్రాంతాల నుంచి బయలుదేరడంతో సమయానికి రాలేకపోయామని పర్యాటకులు సబ్‌కలెక్టర్‌కు ఫోన్‌లో వివరించగా విహారయాత్రకు అనుమతి ఇచ్చారు.



బోటు పాయింట్ వద్ద పర్యాటకుల సందడి

నేడు ఆరుద్ర నక్షత్ర పూజలు

సామర్లకోట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించనున్నట్టు ఈవో నీలకంఠం తెలిపారు. ఆలయ ఆవరణలో దివిస్ లేబ రేటరీస్ సౌజన్యంతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే రాజప్ప ప్రారంభిస్తారు.

మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద

కలెక్టర్ షాన్‌మోహన్

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 12(ఆంధ్రజ్యోతి): భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతా చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రామకృష్ణ మిషన్, జిల్లా యువజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ రాజా ట్యాంకు వివేకానంద పార్కులోని వివేకానందుని విగ్రహానికి ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో కెఎస్వీ కాశీ విశ్వేశ్వరరావు, రామకృష్ణ సేవా సమితి ప్రెసిడెంట్ వీఎల్ గాంధీ, వైస్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణ, సెక్రటరీ కె.శర్మ, కె.రామకృష్ణ, వివిధ యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్: దేశ భవిష్యత్తు యువత పైనే ఆధారపడి ఉందని, యువతకు స్వామి వివేకానంద బోధనలు స్ఫూర్తిగా తీసుకోవాలని సెట్రాజ్ సీఈవో కెఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. రమణయ్యపేట యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డితో కలసి ఘనంగా నివాళులర్పించారు.

పిఠాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని వివేకానంద విగ్రహానికి సహృదయ మిత్ర మండలి ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాస్, సతీష్, డాక్టర్ సూర్యనారాయణ, విశ్రాంత హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ప్రముఖ కవి మేకా మన్మథరావు, భాష్యం స్కూలు ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు, కుమార్, సత్యనారాయణ, త్రిమూర్తులు పాల్గొన్నారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం ఆవరణలోని వివేకానంద విగ్రహానికి వివిధ సంఘాల ప్రతినిధులు కొండేపూడి శంకరరావు, బాదం సూర్యప్రకాష్, వెన్నపు చక్రధరరావు, వూటుకూరి కేశవరావు, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, అల్లవరపు నగేష్, ప్రసాద్, వనం వీరబాబు, సత్యప్రియ పూలమాలలతో నివాళులర్పించారు.

సంప్రదాయాలను పరిరక్షించుకుందాం



బహుమతులు అందజేస్తున్న ఎంపీ శ్రీనివాస్

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పురాతన కాలం నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకుందామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పిలుపునిచ్చారు. పిఠాపురం సీతయ్యగారితోటలో గల జనసేన కార్యాలయం వద్ద ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీ బహుమతులు అందజేశారు. సంక్రాంతిని అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పోటీలు నిర్వహించిన జనసేన మహిళా నాయకులు, వీరమహిళలను అభినందించారు. కార్యక్రమంలో సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబు, జనసేన మహిళా విభాగం ఉమ్మడి గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మీ,డాక్టర్ వరలక్ష్మి ఉన్నారు.

యోగా గురువు జ్యోతులకు గౌరవ డాక్టరేట్



గొల్లప్రోలు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలుకు చెందిన యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావుకు గౌరవ డాక్టరేట్ లభించింది. చెన్నైలోని గ్లోబల్ హ్యూమన్ పీస్ సొసైటీ స్నాతకోత్సవంలో థెరపిస్ట్ యోగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తమిళనాడు విశ్రాంత ఐఏఎస్ అధికారి కె.సంపత్‌కుమార్, చెన్నై సైబర్‌క్రైమ్ అడిషనల్ ఎస్పీ డాక్టర్ డి.తంగరాజన్, చెన్నై విశ్రాంత ఏసీపీ రాజారవి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ కమిషనర్ కె.సుకుమార తదితరులు పాల్గొని నాగేశ్వరరావును అభినందించారు. జ్యోతుల మాట్లాడుతూ ఉభయ తెలుగురాష్ట్రాలతో పాటు ఆన్‌లైన్ ద్వారా అమెరికా, బెహరిన్, జెనీవా దేశాల్లోని వారికి యోగా థెరపీ విధానంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

బైక్‌ల చోరీలపై చర్యలు ఏవి?

● విక్రయించిన వారిని ఎందుకు వదిలివేశారు ● పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బైక్‌ల చోరీ సంఘటనల్లో పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్ల దొంగతనాలు పెరుగుతున్నాయని, ఇందులో మోటార్‌సైకిళ్ల విక్రయించిన వారిని వదిలివేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం బహిరంగసభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిఠాపురంలో చోరీలు, గంజాయి విక్రయాలు అధికమైనా పోలీసులు పట్టించుకోవడంలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పవన్ వాఖ్యల్లో నిజం ఉందని, ఫిర్యాదు చేసినా పోలీసుల్లో కనీస స్పందన ఉండడంలేదని విమర్శించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో ఆదివారం సమావేశంలో ఆయన పోలీసుల పనితీరును తప్పుపట్టారు. జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో భారీగా మోటార్‌సైకిళ్లు చోరీకి గురయ్యాయని తెలిపారు. ఈవిధంగా చోరీచేసిన 35 బైక్‌లను తప్పుడు ధృవపత్రాలు సృష్టించిన కొందరు వ్యక్తులు గొల్లప్రోలు మండలంలోని అమాయక రైతులు, ప్రజలకు విక్రయించారని చెప్పారు. అయితే చోరీచేసిన వ్యక్తిని అరెస్టు చేసి అసలు బైక్‌లు విక్రయించిన వ్యక్తులను వదిలివేశారని ఆరోపించారు. వీరంతా గొల్లప్రోలు మండలానికి చెందిన వారేనని చెప్పారు. చోరీ బైక్‌లు కొని అమాయకరైతులు లక్షలాది రూపాయిలు నష్టపోయారని తెలిపారు. చోరీ బైక్‌లు విక్రయించిన వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి సొమ్ము రికవరీ చేసి నష్టపోయిన రైతులకు అందజేయాలని పలుమార్లు కాకినాడ డీ ఎస్పీని కోరినా స్పందించలేదని విమర్శించారు. వీరిపై చర్యలు తీసుకోకపోవడంతో పిఠాపురం నియోజకవర్గంలో మోటార్‌సైకిళ్ల దొంగతనాలు పెరిగిపోయాయని తెలిపారు. ఈ వ్యవహారం పై ఏలూరు రేంజ్ ఐజీకి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ఏలేరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా, నామా దొరబాబు, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీనివాస్, సూరవరపు సుబ్బారావు, కోడిగుడ్ల పెదబాబు, కర్నాసుల రాజా, రెడ్డెం రాజబాబు, బస్సా సత్యనారాయణ,రాయవరపు తిరుమలరావు ఉన్నారు.

పిఠాపురంలో ఆగని చోరీలు

వేర్వేరు చోట్ల 2 సెల్‌ఫోన్ల అపహరణ

పిఠాపురంలో చోరీలు ఆగడం లేదు. ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో 2 సెల్‌ఫోన్లను అపహరించి ఆగంతకులు పరారయ్యారు. 2 చోట్ల ఒకే రీతిలో చోరీ జరగడంతో వారే అపహరణకు పాల్పడినట్లు భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన డి.మాణిక్యాలరావు తన కుటుంబసభ్యులతో కలిసి పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో దర్శనానికి ఆదివారం వచ్చారు. దర్శనం ముగించుకుని తిరిగి వెళ్లేందుకు బయటకు రాగా ఇద్దరు యువకులు మోటార్‌సైకిల్‌పై వెళ్తూ పడిపోయినట్లు నటించారు. ఇది చూసిన మాణిక్యాలరావు వారి వద్దకు వెళ్లి పైకి లేపేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆయన జేబులో ఉన్న రూ.1.50లక్షలు విలువ చేసే శాంసంగ్ ఫోన్‌ను లాక్కొని అదే బైక్‌పై పరారయ్యారు. వారిని వెంబడించేందుకు మాణిక్యాలరావు, అతడి కుటుంబసభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ సంఘటనపై మాణిక్యాలరావు పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పాదగయ క్షేత్రంలోని సీసీ పుటేజీని పరిశీలించారు. ఇదే రీతిలో పిఠాపురం బైపాస్‌రోడ్డులోని రైస్‌మిల్లర్స్ కల్యాణమండపం వద్ద ఒక వ్యక్తి నుంచి సెల్‌ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు సంఘటనలో ఒకే తరహాలో జరగడంతో ఆ యువకులే చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు.

పాడి రైతుల సంక్షేమం కోసం గోకులాలు



పండూరులో గోకులం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సర్పవరం జంక్షన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమపై ఆధారపడి జీవించే రైతుల సంక్షేమం, గోవులకు నిలువ నీడ కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు గోకులాలు మంజూరు చేసినట్లు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆదివారం పండూరులో రూ.2.35 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోకులాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ పశు పోషణ చేసుకునే రైతులకు మినీ గోకులం ద్వారా షెడ్లను నిర్మించుకునేందుకు సుమారు 90శాతం రాయితీపై రుణం అందిస్తాందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఎంపీడీవో పసుపులేటి సతీష్, గ్రామ కార్యదర్శి ఎం రావెన్యా హన్ చౌదరి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో గణేష్, ఉప సర్పంచ్ వలవల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నందిపాటి అనంతలక్ష్మిత్రిమూర్తులు, కరెడ్ల గోవిందు, నందిపాటి రమణ, బావిశెట్టి ప్రసాద్, మాదారపు తాతాజీ, పుల్ల శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ముగ్గుల పోటీలు

గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఏర్పాటుతో సంక్రాంతి శోభ సంతరించుకుందని, భావితరాలకు సంక్రాంతి పండుగ విశిష్టత చాటేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆదివారం తిమ్మాపురంలో జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, మాదారపు ట్రస్ట్ అధ్యక్షుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన మహిళలకు రూ.1 లక్ష విలువ చేసే 2 ఫ్రిజ్‌లు, గ్రౌండ్లు, మిక్సీలు, బాక్స్‌లు పంపిణీ చేశారు. బాలురకు క్రికెటు కిట్లు, బ్యాట్లు అందించారు.

కోడిపందాలు, గుండాటలు

ఆడే 389మంది బైండోవర్

పిఠాపురం సీఐ శ్రీనివాస్

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో పిఠాపురం పట్టణం, మండలం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో కోడిపందాలు గుండాటలు ఆడేవారు, నిర్వాహకులు 389మందిని బైండోవర్ చేసినట్టు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆదివారం రాత్రి తెలిపారు. కోడిపందాలు ఆడే ప్రదేశాలు గుర్తించి 35మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు. పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి 2 కేసులు నమోదు చేసి 14మందిని అరెస్టు చేసి 24,180, రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా పిఠాపురంలోని వైఎస్ఆర్ గార్డెన్స్, సర్కిల్ పరిధిలోని చిత్రాడ, ఎఫ్‌కేపాలెం, కందరాడ, నరసింగపురం, చెందుర్తి, తాటిపర్తి, దుర్గాడ, రమణక్కపేట, రావివారిపోడు, నాగులాపల్లి, ఇసుకపల్లి, కొండెవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేశామన్నారు. జూదాలు, గుండాటల నిర్వహణకు అనుమతులు లేవని సీఐ స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయం

కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు



కార్మికులకు బోనస్ అందజేస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా స్థానిక జగన్నాధపురంలోని హెచ్ఎంఎస్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 1600 మంది యూనియన్ కార్మికులకు రూ కోటి 60 లక్షల బోనస్ నగదు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఇవ్వని విధంగా ఒక్కో సభ్యునికి రూ10.వేలు చొప్పున బోనస్ ఇచ్చి వారి కుటుంబాల్లో పండుగ ఆనందం నింపడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి యూనియన్ అడహక్ కమిటీ సభ్యులు ఆధ్వర్యం వహించారు. జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గదుల సాయిబాబు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వామ్మి బాలాజీ, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత

వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.4 లక్షల చెక్కులను ఆదివారం తన నివాసం వద్ద ఎమ్మెల్యే కొండబాబు బాధిత కుటుంబాలకు అందజేశారు. గెడ్డం పూర్ణచంద్రశేఖర్, చోడిపల్లి సతీష్, మూగు రాజు, అద్దేపల్లి గంగరాజు, దంగేటి సతీష్, చింతపల్లి తాతారావు పాల్గొన్నారు.

'గంజాయి జోలికెళ్లవద్దు'

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గంజాయి జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పిఠాపురం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి సేవించే వ్యక్తులు, గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నవారికి ఆదివారం వారి తల్లిదండ్రుల సమక్షంలో సీఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. గంజాయి మత్తులో ఉంటే మంచి, చెడు ఆలోచన ఉండదని, విచక్షణ మరిచిపోతారని, అన్ని రకాల నేరాలకు గంజాయి మత్తు కారణమవుతున్నదని చెప్పారు. ప్రభుత్వం చేపట్టిన డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో వారితో ప్రమాణం చేయించారు. సంక్రాంతిని కుటుంబంతో జరుపుకోవాలని సూచించారు. కౌన్సిలింగ్‌లో పట్టణ, రూరల్ ఎస్ఐలు మణికుమార్, గుణశేఖర్ ఉన్నారు.

రేపటి నుంచి కావమ్మ, మారయ్య తిరునాళ్లు

సామర్లకోట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలో పురాతన ప్రసిద్ధి పొందిన కావమ్మ, మారయ్య తిరునాళ్ళ ఉత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక నిర్వాహకులు సుకపట్ల నాగేశ్వరరావు, మారిబాబు తెలిపారు. సామర్లకోట పరిసర ప్రాంతాల్లో ఎంతో ఇష్టదైవంగా కొలిచే కావమ్మ, మారయ్యల తిరునాళ్ళ పండుగ రోజుల్లో మూడు రోజులు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు వద్దిపర్తి నాగేశ్శర్మ పర్యవేక్షణలో అభిషేకం, అమ్మవారి పల్లకీ సేవ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 15న అభిషేకం, అమ్మవారి గ్రామోత్సవం, సాయంత్రం పసుపు, కుంకుమలతో సారె పంపిణీ నిర్వహిస్తామన్నారు. 16న ఉదయం అభిషేకపూజలు, గ్రామోత్సవం, సారె పంపకం నిర్వహిస్తామన్నారు. 18,19తేదీల్లో అమ్మవారి గ్రామోత్సవంతో పూర్ణాహుతి పూజలు నిర్వహిస్తామని నాగేశ్వరరావు, మారిబాబు తెలిపారు.

కందరాడలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

పిఠాపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కందరాడలో సంక్రాంతి సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని భారతి విద్యాలయలో విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో అందరిని అలరించారు. భోగిమంట చుట్టూ హరిదాసుతో కలిసి కీర్తనలు ఆలపిస్తూ ప్రదక్షణాలు చేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, పాఠశాల కరస్పాండెంట్ గండి రామతులసి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాకాంతం నేత్ర దానం

తాళ్లరేవు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం గ్రామానికి చెందిన ఖండవిల్లి సూర్యాకాంతం(90) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ కుటుంబ సభ్యుల అంగీకారంతో కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్‌కు సూర్యాకాంతం రెండు నేత్రాలను దానం చేశారు. ఐ బ్యాంక్ టెక్నీషన్లు కార్నియాలను సేకరించారు.

భోగి పిడకల దండలు అందజేత

గొల్లప్రోలు రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలను అందరికి తెలియచెప్పి వాటిని గౌరవించాలని ప్రకృతి వ్యవసాయం రైతు గుండ్ర శివచక్రం సూచించారు. సంప్రదాయ పద్ధతిలో తయారుచేసిన 10వేలభోగి పిడకలను ఆదివారం గ్రామంలోని విద్యార్థులకు అందజేశారు. భారీ భోగిదండలు తయారుచేసి వాటిని సోమవారం భోగిమంటల్లో వేస్తామన్నారు.

ఘనంగా 'పిడకలు దండే' పండుగ



కొత్తపల్లిలో పిడకలు దండుతున్న చిన్నారులు

కొత్తపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం పిడకల దండే పండుగను ఘనంగా నిర్వహించారు. భోగి ముందు రోజు పిడకల దండే పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో చిన్నారులు గోనె సంచులతో ప్రతీ ఇంటికి తిరిగి పిడకలు, పాత చెక్క సామగ్రి దండారు. ఇలా దండిన పిడకలు, పాత చెక్క ఫర్నిచర్, పుల్లలు తదితర సామగ్రిని భోగి మంటలో వేస్తారు. ఈపిడకలు దండే సమయంలో ఎప్పుడెప్పుడు పండుగ, ఏడాది పండుగ, అల్లుడు ఎందుకొచ్చాడు, అటుకులు తినడానికి వచ్చాడు, కుతురెందుకు వచ్చింది, కుడుములు తినడానికి వచ్చిందంటూ పాటలు పాడుతూ పిడకలు దండే పండుగను ఘనంగా నిర్వహించారు.

కోడి పందాల శిబిరాలు తొలగింపు



శిబిరాలు తొలగిస్తున్న దృశ్యం

సామర్లకోట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయాలకు విరుద్ధంగా ఆయా గ్రామాల్లో ఆదివారం తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వీఆర్వోలు, పోలీసు అధికారులతో కలిసి కోడి పందాలు కోసం ఏర్పాటుచేసిన శిబిరాలను తొలగించారు. సంక్రాంతి సంబరాలు ముద్దు కోడి పందాలు వద్దు అంటూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కోడిపందాలు నిర్వహిస్తే పోలీసు కేసులు తప్పవని హెచ్చరించారు. ఘర్షణలు, వివాదాలకు దూరంగా ప్రశాంతవాతావరణంలో సంక్రాంతి పండుగను చేసుకోవాలని తహశీల్దార్ కోరారు. ఉండూరు, జీ.మేడ పాడు, గోలివారి కొత్తూరు, రావువారి చంద్రం పాలెం, అచ్చంపేట, పనసపాడు, వీకెరాయ పురం గ్రామాలకు చెందిన వీఆర్వోలు, పోలీసులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి సాయం: ఎమ్మెల్యే



సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే దాట్ల

తాళ్లరేవు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారందరినీ కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని, వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం సాయం అందిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం మురమళ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోరింగ, పోలేకుర్రు లబ్ధిదారులకు సీఎం రీలీఫ్‌ఫండ్ రూ.11.90లక్షల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే దాట్ల అందజేశారు. కార్యక్రమంలో కోరింగ టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ, పోలేకుర్రు నేతలు వడ్లమూరి సతీష్, జక్కల ప్రసాద్, యేరుపల్లి వీరన్న, వైదాడి శ్రీనివాసరావు, ముత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరికి ఘన నివాళులు



పిల్లంకలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్షత్రియ యువకులు

తాళ్లరేవు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పిల్లంక గ్రామంలో క్షత్రియపరిషత్ యువకులు పలువురు పూలమాలలతో ఆదివారం ఘన నివాళిలర్పించారు. అమెరికా, హైదరాబాద్, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల రీత్యా ఉన్న క్షత్రియ యువకులు సంక్రాంతి సందర్భంగా పిల్లంక గ్రామం విచ్చేసి గెట్‌టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీవేణుగోపాలస్వామివారికి లక్షపత్రిపూజ చేశారు. ఆనందోత్సవాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు.

రేషన్ డీలర్ల సంఘ మాజీ అధ్యక్షుడి మృతి

కొత్తపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు దంగేటి శ్రీనివాసరావు(50) ఆకస్మికంగా మృతి చెందారు. రెండు సార్లు సంఘ అధ్యక్షుడిగా పనిచేశారు. శ్రీనివాసరావు మృతికి కొత్తపల్లి మండల రేషన్ డీలర్లు తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ



అప్పారావు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తనయుడు

సామర్లకోట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌పురం మాజీ సర్పంచ్ కోట వరలక్ష్మి అప్పారావు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు నిమ్మకాయల రంగనాగ్ ఆదివారం పరామర్శించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అప్పారావు తల్లి ఇటీవల అస్వస్థతతో మరణించిన విషయం విదితమే. కార్యక్రమంలో హుస్సేన్‌పురం టీడీపీ నాయకులు చల్లా బుజ్జి, చల్లా ప్రభాకరరావు (కొండ), కోట సురేష్, తలారి శ్రీను, తలారి పోతురాజు పాల్గొన్నారు.

కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



పెద్దాపురంలో పందెంబరిని తొలగిస్తున్న సిబ్బంది, ఎస్ఐ మౌనిక

పెద్దాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని మండలాల్లో సంక్రాంతి ముసుగులో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి హెచ్చరించారు. స్థానిక విలేకరులతో ఆమె ఆదివారం మాట్లాడారు. రెవెన్యూ, పోలీస్ శాఖలు హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలను చేపడతామన్నారు. పెద్దాపురం ఎస్ఐ వి.మౌనిక మండల పరిధిలో పందెం బరులను సిబ్బంది సహాయంతో తొలగించారు.

ముగ్గులు పోటీల విజేతలకు బహుమతులు

తాళ్లరేవు, జనవరి12(ఆంధ్రజ్యోతి): చొల్లంగిపేటలో సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ కందెళ్ల గంగాభవాని, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ మందాల గంగసూర్యనారాయణ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు సర్పంచ్ గంగాభవాని అందించారు. పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి మాజీ చైర్మన్ గంగసూర్యనారాయణ బహుతులు అందజేశారు. విజేతలను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అభినందించారు.గ్రామ పెద్దలు కందెళ్ల గంగబాబు, మందాల సత్తిబాబు, పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తా: వర్మ

పిఠాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఎల్లప్పుడు ముందుటానని మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం పట్టణ శివారులో వారంరోజులుగా జరిగిన దుర్గాప్రసాద్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆది వారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వర్మ పాల్గొని విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన దుర్గ 11టీమ్, వీఎస్ రాయ్ టీమ్‌లకు వర్మాస్ కావ్య ఫౌండేషన్ ద్వారా షీల్డులు, నగదు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, టోర్నీ నిర్వాహకులు, గిరీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

'కూటమి పాలనలో ప్రజలకు సంతోషం లేదు'

సర్పవరంజంక్షన్, జనవరి12(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వ పాలనలో టీడీపీ నాయకులు, పెద్దలు సంతోషంగా ఉన్నారు తప్ప, ప్రజలెవరూ సంతోషంగా లేరని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు తెలిపారు. ఆదివారం వైద్యనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు చంద్రన్న కానుక కూడా పంచలేని స్థితిలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఉందన్నారు.

గంగనాపల్లిలో ముగ్గుల పోటీలు

విజేతలకు బహుమతులు అందజేత

కాకినాడ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గంగనాపల్లిలోని చైతన్యనగర్‌లో గ్రామ సర్పంచ్ గీసాల మహాలక్ష్మి సహకారంతో గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారి సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. మహిళలు వేసిన ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ముగ్గుల పోటీల్లో విజేతలకు సర్పంచ్, ఎంపీటీసీ సత్యవేణి బహుమతులు అందజేశారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీఠం వేసిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం లచ్చిపాలెం, తాళ్లరేవు, చొల్లంగి, కోరింగ గ్రామాల్లో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.45లక్షలతో నిర్మించిన గోశాల, సిమెంటురోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు.

వేలం ప్రకటన
IN THE COURT OF THE I ADDITIONAL SENIOR CIVIL JUDGE, KAKINADA
E.P. 57/2016; O.S.352/2008
Between
CHEKURI SRILAKSHMI ... DHr / Plaintiff
and
KOMARINA SUBBALAKSHMI and OTHERS ... JDrs / Defendants
పై నెంబరు E.P లో పైన తెలిపిన JDrs డిక్రీ బాకీ చెల్లించనందున పైన తెలిపిన JDrs తాలూకు ఈ క్రింది తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారి యెదుట ది. ది.24-1-2025 తేదీన ఉదయం 10.30 ని.లకు బహిరంగ వేలం వేయబడును. కాబట్టి సదరు వేలం పాటలో పాల్గొనదలచినవారు పూర్తి వివరములు కొరకు పై కోర్టువారి సెంట్రల్ నాజర్ వారి ఆఫీసులో గాని, DHr తరఫు అడ్వకేట్ వారి ఆఫీసులో గాని సంప్రదించవలెను.
SCHEDULE: Vacant house site in an extent of 300 Sq. Yards in Plot No. 95 situated in S.No. 33/3 of A.P.L.P.No.152/1994, Timmapuram Village, Timmapuram Gram Panchayat, Samalkot Sub-Registry, Kakinada Rural Mandal, Previously East Godavari District, Present Kakinada District. Within the following boundaries: East: 76' - Layout Road, West: 76' - Others Plot; South: 40'29" - Layout Road; North: 42'-Others Land.
Within the above boundaries an extent of 300 Sq. Yards with all easement rights.
DHr / Plaintiff Value : Rs.5,00,000/-
Amina Value : Rs. 9,00,000/-
J. PRABHAKAR
G. VISWESWARA DESI Advocates,
D.No.68-9-12, State Bank of India Colony
Ashok Nagar, KAKINADA. Cell : 9440262977

Anand CINEMAS (4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA

DEVI CINEMAS (4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA

BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING



SCREN-1
DAKU MAHARAAJ : 11-00AM, 2-00PM, 6-15PM,9-15PM
SCREN-2
PUSHPA THE RULE PART 2
11-05AM, 2-45PM, 6-30PM, 10-10-PM
GAME CHANGE (TEL) :
11-30AM, 2-45PM, 6-00PM, 9-30PM

SCREN-1
DAKU MAHARAAJ :
11-00AM, 2-00PM, 6-15PM, 9-15PM
SCREN-2
GAME CHANGE (TEL) :
11-15AM, 02-30PM, 06-20PM, 9-45PM

ప్రథమ విజేతకు అభినందన

ప్రత్తిపాడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఎడ్ల పందెల్లో జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించిన జువ్వల సత్తిబాబును ఆదివారం మండలంలోని ధర్మవరంలో ఎంఎంఆర్ ట్రస్టు అధినేత మురళీరాజు అభినందించారు. జువ్వల సత్తిబాబును ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసి రూ.5వేలు నగదు, దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు జువ్వల సుజాతబాబులు, సత్యవతి చంటి, సీతారామరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

కోడి పందాల కోసం

టీడీపీ, వైసీపీ భాయి.. భాయి

● గతంలో కొనసాగించిన సాంప్రదాయ బరుల్లోనే పందాల కోసం ఏర్పాట్లు

రంపచోడవరం, జనవరి12(ఆంధ్రజ్యోతి): మన్యంలో కోడిపందాల కోసం పార్టీల కతీతంగా అధికార టీడీపీ, వైసీపీ క్యాడర్ నాయకులు జట్టుకట్టి తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గతంలో జరిగిన చందంగానే ఆయా సాంప్రదాయ బరుల్లోనే ఈ పందాలను నిర్వహించుకునేందుకు ఇరుపార్టీల గ్రామస్థాయి నేతలు అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్నారు. గతంలో వైసీపీ హయాంలో ఏవిధంగా ఈ పందాలు నడిచాయో ఈమారు కూడా అదే మాదిరిగా ఇపుడు అధికార టీడీపీ క్యాడర్ సారధ్యంలో పందాలను నిర్వహించుకుంటున్నారు. గతంలో ఏఏ ప్రాంతాలలో ఈ పందాల కోసం బరులు ఏర్పాటయ్యాయో దాదాపుగా అక్కడే ఈమారు కూడా పందాలను నిర్వహిస్తున్నారు. పోలీసుల నుంచి కూడా ఏ ఇబ్బందులూ లేకుండా ఎక్కడికక్కడ ఆయా పందాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు. మైదాన ప్రాంతాల మాదిరిగా మన్యంలో కోడి పందాలు జూదం మాదిరిగా కాకుండా సాంప్రదాయంగా సరదాకు నిర్వహించుకునే ప్రాంతాలే అధికంగా ఉన్నాయి. దీంతో ఇక్కడి పందాలతో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఎవరికీ పెద్ద ఇబ్బందులు తలెత్తని పరిస్థితులు నెలకొని ఉన్నాయి. అయినప్పటికీ కోడి పందాలపై ఉక్కుపాదం కొనసాగిస్తున్నామని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు.



ఎటపాకలో బరి కంచెను తొలగిస్తున్న సీఐ, సిబ్బంది

ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో గతంలో ఇటువంటి కోడి పందాల కేసులలో నిందితులుగా ఉన్న వారిని గుర్తించి ముందు జాగ్రత్తగా వారిపై బైండోవర్ కేసులను నమోదు చేస్తున్నారు.

నెల్లిపాకలో పందెం బరి ధ్వంసం

ఎటపాక, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు కోడి పందాల నిర్వహణ కోసం సిద్ధం చేసిన పందెం బరిని పోలీసులు ఆదివారం ధ్వంసం చేశారు. నెల్లిపా క గ్రామంలోని చింతూరు రోడ్ ఏర్పాటుచేసిన బరి చుట్టూ ఏర్పాటుచేసిన కంచెలను సీఐ కన్నపరాజు తన సిబ్బందితో వెళ్లి ధ్వంసం చేశారు. బరికోసం నలువైపులా సిద్ధం చేసిన కంచెలను తొలగించారు. సంక్రాంతి పండుగ ముసుగులో కోడిపందాలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే సహించబోమనిసీఐ హెచ్చరించారు.

సంక్రాంతి వారపు సంత హడావుడి

● రంపచోడవరంలో వేలకొద్దీ తరలి వచ్చిన గిరిజనంతో కిక్కిరిసిన రహదారులు



రంపచోడవరంలో రద్దీగా ఉన్న వారపు సంత

రంపచోడవరం, జనవరి12(ఆంధ్రజ్యోతి): మన్యం వారపుసంతలంటేనే ఓ ప్రత్యేకం. అందునా సంక్రాంతి ముందు వచ్చే వారపు సంతలైతే అక్కడే సంక్రాంతి పండుగ జరుగుతోందా అనిపించేలా ఉంటాయి. ఆదివారం రంపచోడవరంలో జరిగిన వారపుసంత సంక్రాంతి పండగకు అద్దం పట్టింది. రంపచోడవరం, మారేడుమిల్లి, దేవీపట్నం, వై.రామవరం మండలాలకు చెందిన అనేక గిరిజన గ్రామాల నుంచి వేలాదిగా గిరిజనులు ఈ సంతకు తరలివచ్చారు. సంతల్లో వేసే బట్టల దుకాణాలు, బంగారపు దుకా ణాలు, అలంకార వస్తు దుకాణాలు, పిండి వంటల దుకాణాలు ఇలా అన్ని దుకాణాల వద్ద విపరీతమైన రద్దీ కొనసాగింది. గతంలో కంటే ఈ మారు పం డుగకు గిరిజనుల చేతుల్లో నగదు బాగా చెలా మణిలో ఉంటడంతో వారి ఆనందానికి అవధు లు లేకుండా కొనుగోలు చేశారు.

ఇంకా మన్యంలో కొనసాగుతున్న వస్తుమార్పిడి విధానం కూడా ఈ సంక్రాంతి పండగలో మరింతగా కొన సాగింది. గతంలో గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన ఆయా అటవీ ఉత్పత్తులకు సంబంధి ంచి వ్యాపారులు ఈ సంతలో పెద్దఎత్తున నగదు బట్వాడా చేశారు. దీంతో ఆయా గిరి జనుల చేతుల్లో ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఆయా సంక్షేమ నిధులకు తోడుగా చేరడంతో గిరిజనుల్లో విపరీతంగా కొనుగోలు శక్తి పెరిగింది. ఈ సంక్రాతి మన్యం గిరిజనుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

గోవులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు



గోవులను స్వాధీనం చేసుకున్న చింతూరు పోలీసులు

చింతూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కంటైనర్‌లో గోవులను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఎస్ఐ పి.రమేష్ ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా .. ఒడిస్సా నుంచి వయా చింతూరు మీదుగా హైదరాబాద్‌కు గోవులను తరలిస్తున్న సమాచారం తమకు అందిందన్నారు. దీంతో సరిహ ద్దుగ్రామమైన కల్లేరులో వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో ఒకే కంటైనర్‌లో 84 పశువులను తరలిస్తున్న విషయం బహిర్గతమైందన్నారు. గోవులతోపాటు కంటైనర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. గోవులను తరలిస్తూ పట్టుబడిన ఒడిస్సాలోని నవరంగ్‌పూర్‌కు చెందిన వీటీ కమల్, ఎస్కే. ఉస్మాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు. కంటైనర్ డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నారన్నారు. స్వాధీనం చేసుకున్న గోవులను గోశాలకు తరలించామన్నారు. గోవులను తరలిస్తున్న సమాచారం ఏ ఒక్కరికి తెలిసినా అట్టి సమాచారం సంబంధిత అధికారులకు తెలియజేయాల్సిందిగా ఎస్ఐ కోరారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ కన్నపరాజు

ఎటపాక, జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను క్రీడాస్ఫూర్తిగా తీసుకుని, స్నేహభావంతో మెలగాలని ఎటపాక సీఐ కన్నపరాజు పేర్కొన్నారు. ఆదివారం కృష్ణవరం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ మెమోరియల్ మండలస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ వాలీబాల్ పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా సీఐ కన్నపరాజు మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాని, ముఖ్యంగా మత్తు పదార్థాల జోలికి వెళ్ల వద్దని సూచించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, నిర్వాహకులు దానే ప్రసాద్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి భక్తుల తాకిడి

దేవీపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గొందూరు గ్రామ చోదెవారి ఆడపడుచు స్వయంభు మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారికి ఆయాలనికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచి పవిత్రమైన గోదావరి స్నానాలాచరించి అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

'అలనాటి జ్ఞాపకాలు మరువలేనివి'

గండేపల్లి, జనవరి12(ఆంధ్ర జ్యోతి): అలనాటి జ్ఞాపకాలు మరువలేనివని పూర్వవిద్యార్థులుఅప్పటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. మండలంలో జడ్.రాగంపేట గ్రామ శివారున ఉన్న పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సంక్రాంతి సందర్భంగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్న త పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 2000-2001లో విద్యాభ్యాసం చేసిన పూర్వవిద్యార్థులు ఆత్మీయకలయిక ఇక్కడ జరుపుకున్నారు. 188 మంది విద్యార్థులకు 130మంది కుటుంబ సమేతంగా పిల్లాపాలతో హాజరయ్యారు. అనంతరం అప్పటి గురువులను సత్కరించారు.



పరిణయ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కోడిపందాల బరులు ధ్వంసం

● కోడిపందాలు నిర్వహిస్తే కఠినచర్యలు

జగ్గంపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి ప్రారంభం కానున్న సంక్రాంతి పురస్కరించుకుని జరిగే కోడిపందాలకు ఏర్పాటు చేసిన బరులను ధ్వంసం చేసి బరులను వేసే వారిని, పాత నేరస్తులను బైండోవర్ చేసినట్లు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి వరకు 287 మందిని బైండోవర్ చేశామన్నారు. జగ్గంపేట 77, కిర్లంపూడి 110, గండేపల్లి పీఎస్ 100, మందిని పాత నేరస్తులను, అనుమానితులను బైండోవర్ చేశామన్నారు. డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కోడిపందాలు బరులను ధ్వంసం చేశారు.

ప్రత్తిపాడు: మండలంలో కోడిపందాల బరులపై ప్రత్తిపాడు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం ఆదివారం స్పందించారు. మండలంలోని ఒమ్మంగి, శరభవరం గ్రామంలో కోడిపందాలు కోసం ఏర్పాటుచేసిన బరులను ట్రాక్టర్లతో దున్నించేశారు. భోగి పండుగ నుంచి మూడు రోజులపాటు కోడిపందాల నిర్వహణకు ఈ రెండు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఫెన్సింగ్, టెంట్లు ఏర్పాటు చేసి నిర్వాహకులు సన్నాహాలు చేపట్టారు. ఈ ఏర్పాట్ల ఆచూకీ తెలుసుకున్న ఎస్ఐ తన సిబ్బందితో బరుల ప్రదేశాలకు తరలివెళ్లి ట్రాక్టర్లను రప్పించి బరులను దున్నించి టెంట్లు తొలగించారు. కోడిపందాలు, గుండాట, పేకాట వంటి జూదాలు సంక్రాంతి రోజుల్లో నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గండేపల్లి: కోడి పందాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్ఐ యూవీ శివనాగబాబు అన్నారు. ఆదివారం మండలంలో గండేపల్లి, మల్లేపల్లి, ఎన్టీరాజాపురంలో గతంలో నిర్వహించిన కోడిపందేలబరులను పరిశీలించారు. కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అక్కడ స్థల యజమానులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రవికిరణ్, వీఆర్వో సుబ్బారావు పాల్గొన్నారు.



మల్లిపాకలో బరులను ట్రాక్టర్‌తో దున్నిస్తున్న దృశ్యం

కోటనందూరు: సంక్రాంతి సందర్భంగా జూదాలు ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా కెఇ చిన్నయ్యపాలెంలో బరులు ఏర్పాటుచేశారు. దీంతో ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో బరులను తొలగించారు. మండలంలో సంక్రాంతిలో ఎక్కడైనా సరే పందాలు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.



మల్లేపల్లిలో కోడి పందేల బరులు పరిశీలిస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

'యువత క్రీడల్లో రాణించాలి'



తొండంగి, కోటనందూరులో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

తొండంగి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు అన్నారు. ఆదివారం తాటియాకులపాలెంలో జరిగిన వాలీబాల్ పోటీ విజేతలకు వారు బహుమతులు అందించారు. టోర్నమెంట్‌లో 18 టీమ్‌లు పాల్గొనగా ఒంటిమామిడి టీమ్ విజేతగా నిలిచింది. జీఎంపేట టీమ్ రన్నర్స్‌గా నిలువగా వీరికి షీల్డులు నగదు బహుమతిని అందించారు. దురలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్, సర్పంచ్ అంగులూరి సుధాకర్, కోడ వెంకటరమణ, చొక్కా అప్పారావు, కాశీ పాల్గొన్నారు.

క్రీడలతోనే నిజమైన సంక్రాంతి

తునిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ క్రీడలతోనే నిజమైన సంక్రాంతిని, జూద క్రీడలకు యువత దూరంగా ఉండాలని తుని రూరల్ ఎస్ఐ కృష్ణమాచార్యులు స్పష్టం చేశారు. వి.కొత్తూరు గ్రామంలో వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించి సంక్రాంతి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు చాటి చెప్పేలాగా మెలగాలని తెలిపారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు అందజేత

కోటనందూరు, జనవరి12(ఆంధ్రజ్యోతి): యువ త సంస్కృతీ సంప్రదాయాలపట్ల మరింత అవగాహన పెంచుకోవాలని తుని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు అన్నారు. ఆదివారం కోటనందూరు మదర్ విద్యాసంస్థలో సంక్రాంతి సంబరాలల్లో భాగంగా పోలీసులు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అనంతరం మండలంలో 14 టీమ్‌లు పాల్గొనగా ప్రథమ బహుమతి బిళ్లనందూరు జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ బహుమతి పాతకొట్టాం జట్టుకు రూ.5వేలు, మండల పార్టీ అధ్యక్షుడు గాడి రాజుబాబు, సీఐ చెన్నకేశవరావు అందజేశారు. పాల్గొన్న 14 జట్లకు ప్రముఖ పారిశ్రామికవేత్త వెలగా వెంకటకృష్ణారావు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డి.చిరంజీ విరాజు, ఎస్ఐ టి.రామకృష్ణ, పి.ప్రవీన్, రాజశేఖ, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

కోటనందూరు, జనవరి12 (ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండలం ఇండుగపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధమ య్యాయి. ఇందుకు స్పందించిన వివరాల ప్రకారం గ్రామంలో అందరూ నిద్రలో ఉండగా అల్లు లింగ య్య, అల్లు నూకాలమ్మకు చెందిన రెండు ఇల్లు కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనలో సు మారు రూ.లక్ష ఆస్తినష్టం జరిగిందని వాపోయారు. ఈ సంఘటన జరిగిన వెంటనే రెవెన్యూ అధికారులకు తెలియజేయజేస్తామని స్థానికులు తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

గండేపల్లి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి గ్రా మశివారున రాజమండ్రి నుంచి వైజాగ్ వైపు వెళ్తున్న బస్సు మల్లేపల్లిశివారున బ్రిడ్జి దిగే సమయంలో ఓ ప్రయాణికుడు బస్సు ఆపగా బస్సు సడన్ బ్రేక్ కొట్టడంతో బస్సు వెనుక వస్తున్న కారు స్లో చేయడంతో దాని వెనుక వస్తున్న లారీ కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎటువంటి గాయాలు కాలేదు. తృటిలో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

హైందవ సంస్కృతి గొప్పతనాన్ని చాటిన వివేకానందుడు

● ప్రత్తిపాడులో వివేకానంద జయంతి



ప్రత్తిపాడు నరేంద్రగిరివద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హైందవ సంస్కృతి, సనాతన సంప్రదాయాల గొప్పతనాన్నిచాటిన మహనీయుడు వివేకానందుడని మినర్వా ఫౌండర్ డీపీఎస్ రమేష్ రాజు అన్నారు. స్థానిక నరేంద్ర గిరి కొండపై ఉన్న ఎత్తైనా స్వామివివేకానంద విగ్రహానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో ముక్కుసుబ్రహ్మణ్యం, రేపాకప్రసాద్, బర్రే కోటేశ్వరరావు, సింగిలిదేవ్‌సత్తిరాజు, దొడ్డిపట్ల సోమన్నదొర, ఏడిద రెడ్డి నాయుడు, ఎల్లపు సూర్యనారాయణ, రాసంశెట్టి రాజ, రామకుర్తి రాజబాబు, శివ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్వామి వివేకానంద జీవితాన్ని యువత ఆదర్శమని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పేర్కొన్నారు. ఆదివారం మండలంలో పెద్దనాపల్లిలో టీడీపీ నాయకుడు సుంకర సత్తిబాబు, సిరపురంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో, కోనేటి పాఠశాల ఆవరణలో అలమండ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, పెదకాపు, అనపర్తి మణి కుమా ర్, వెలుగూరి హరేరామ్,సామంతుల చిన్నారావు తదితరులు ఉన్నారు.



జగ్గంపేటలో వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జగ్గంపేట: వివేకానందుడు యావత్తు భారతీయులకు ఆదర్శమని వివేకానంద విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఒమ్మి రఘురామ్ అన్నారు. ఆదివారం ఆయన విద్యాసంస్థల ఆవరణలో వివేకానందుడి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

● జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవంను ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చెన్నారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వామీ వివేకానంద విశిష్టతను వివరించారు. కార్యక్రమండలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, అకడమిక్ కో ఆర్డినేటర్ పి.విశ్వశ్వర్, సత్యనారాయన, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● స్వామీ వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలని జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజనాల శ్రీను, సూరప రెడ్డి నరేష్, కాయల మణికంఠ,రేవు శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

అధ్వాన రహదారుల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే సత్యప్రభ



గోకవరంలో రహదారి నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు నియోజకవర్గంలో అధ్వాన రహదారులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని గోకవరం, పెద్దిపాలెం, రౌతుపాలెం, టి. రాయవరం గ్రామాల్లో రూ.4కోట్లతో నిర్మించే నాలుగు రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల వ్యవధిలోనే నియోజకవర్గంలో శిథిలరహదారులు అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారాలోకేష్ సహకారంతో రహదారి నిర్మాణ పనులు చేపట్టామన్నారు. టి.రాయవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోకులాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఉత్తరకంచి గ్రామంలో ప్రధాన రహదారి ఇరుకుమయం కావడం వల్లట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ రహదారిని డబుల్ రోడ్డు రహదారిగా నిర్మించాలని ఆ గ్రామ సర్పంచ్ మంతెన వెంకటరమణ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వనపర్తి రామలక్ష్మినాగేశ్వరరావు, తటవర్తి సుబ్బారావు, ఎం.శ్రీను, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, మండల ఇంజనీరింగ్ అధికారి సత్యప్రకాష్, కాంట్రాక్టర్లు పడాల గంగాధర్, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు

దేవీపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందుకూరు వన్ ఏనుగుల గూడెం అగ్రహారం ఆర్అండ్ఆర్ కాలనీలో క్రేజీ కార్ట్ విలేజ్ షాపింగ్ వారు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. గెలుపొందిన వారికి ముఖ్యఅతిథి దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి బహుమతులు అందజేశారు. మంటూరు, ఏనుగులగూడెం, అగ్రహారం గ్రామాలమహిళలు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న సర్పంచ్ రాజామణి

టోల్‌ప్లాజా వద్ద పోలీసుల గస్తీ

జగ్గంపేట/కిర్లంపూడి, జవవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సొంతూళ్లకువచ్చే వారి వాహనాలతో టోల్‌ప్లాజాల రద్దీ ఏర్పడుతున్న నేపథ్యంలో సర్కిల్ పరిధిలోని అన్ని టోల్‌ప్లాజాలవద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. కిర్లంపూడి, జగ్గంపేట ఎస్ఐలతో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలని టోల్‌ప్లాజా సిబ్బందికి కౌన్సెలింగ్ చేశామన్నారు. చిరువ్యాపారులు రహదారికి అటుఇటూ ఇష్టానుసారంగా పరుగులు తీయవద్దన్నారు. టోల్‌ప్లాజాకు రెండు వైపులా 500 మీటర్ల వరకు నిషేధితమని, అక్కడ ఎలాంటి వ్యాపారాలు నిర్వహించవద్దని, ఈ నిబంధ నలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూర్పుకాపు సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

జగ్గంపేట, జనవరి12 (ఆంధ్రజ్యోతి):స్థానిక లయన్స్‌క్లబ్‌లో రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్‌ను శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి పీసీసీ చంద్రమోహన్ మాట్లాడుతూ తూర్పుకాపు జాతి కోల్పోయిన ఓబీసీ రిజర్వేషన్ సాధనకోసం ఎన్నో ఉద్యమాలు చేయడమే కాకుండా, అన్ని రాజకీయ పార్టీల నేతలకు, కేంద్ర ప్రభుత్వ మంత్రులకు వినతి పత్రాలు అందజేశారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు బడ్డుకొండ వెంకటరమణ, తూర్పుకాపు జేఏసీ చైర్మన్ గిరడా అప్పల స్వామి నాయుడు, ఉద్యోగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు బలగ మల్లేశ్వరరావు, కలిశెట్టి అచ్చంనాయుడు, తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు నారాయణస్వామి, పెద్దకాపు పాల్గొన్నారు.

ఓంకార స్వామి జయంతి వేడుకలు రద్దు

ప్రత్తిపాడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతి ఆశ్రమం లో ఈ ఏడాది ఓంకార స్వామి జయంతి వేడుకలు రద్దుచేశారు. ఏటా జనవరి 21న ఈ ఆశ్రమంలో ఓంకారస్వామి జయంతిని వైభవంగా నిర్వహించేవారు. కరోనా నాటి నుంచి ఈ ఆశ్రమంలో ఓంకార స్వామి జయంతి వేడుకలు నిర్వహించడంలేదు. ఈఏడాది ఓంకార స్వామి 131వ జయంతిని నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టడం లేదని భక్తులు, ప్రజలు శాంతి ఆశ్రమ నిర్వాహకుల కమిటీ ఆదివారం స్పష్టం చేసింది.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



దుర్గబాబు

తునిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైనట్లు తుని రూరల్‌పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. తేటగుంట గ్రామానికి చెందిన నక్క దుర్గబాబు(34)గత నాలుగురోజులుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పైన చిత్రంలో చూపిన యువకుడు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మహిళ అదృశ్యం



పల్లి రాజేశ్వరి

కిర్లంపూడి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కిర్లంపూడి మండలానికి చెందిన పల్లి రాజేశ్వరి అదృశ్యంపై ఆదివారం కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆమె ఆ చూకీ లభించకపోవడంతో బంధువులు కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆమె ఆచూకీ లభిస్తే 9440796529, 9440904834లో సంప్రదించాలన్నారు.

శ్రీప్రకాష్‌లో అలరించిన కేరింతలు



ఏపీఆర్ఎస్ఎస్ కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

తునిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏటా శ్రీప్రకాష్ విద్యాసంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కేరింతలు కార్యక్రమం చిన్నారుల ఆటపాటల మధ్య ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ము ఖ్యఅతిథిగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి సీఏవీఎస్ ప్రాజెక్టు సమన్వయకర్త వోలేటి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలు కలిగి ఉండాలని తెలిపారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకు మాత్రమే పరిమితమై వారి ఒత్తిడి పెరిగి మానసిక సంఘర్షణకు లోనవుతున్నారని ఆటపాటలతో కూడిన విద్యాబోధన వారికి మరింత ప్రోత్సా హం ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహరావు, ప్రిన్సిపాల్ ఎంఈవీఎస్ మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

Anand CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA

DEVI CINEMAS (4 SCREENS) Experience it in 4K Dolby Atmos
CINEMA ROAD KAKINADA

BOOK ONLINE TICKETS Paytm

NOW SHOWING



SCREN-1
DAKU MAHARAAJ : 11-00AM, 2-00PM, 6-15PM,9-15PM
SCREN-2
PUSHPA THE RULE PART 2
11-05AM, 2-45PM, 6-30PM, 10-10-PM
GAME CHANGE (TEL) :
11-30AM, 2-45PM, 6-00PM, 9-30PM

SCREN-1
DAKU MAHARAAJ :
11-00AM, 2-00PM, 6-15PM, 9-15PM
SCREN-2
GAME CHANGE (TEL) :
11-15AM, 02-30PM, 06-20PM, 9-45PM